క్లుప్తంగా

శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శాంతి కల్యాణం



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివ రాత్రి సందర్భంగా స్వామివారికి అభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. ఉదయం 10 గంటలకు శివసాధంలో స్వామివారికి శాంతి కల్యాణం చేశారు. అనంతరం పల్లకీలో స్వామివార్లను ఆలయ ప్రాంగణంలో మేళ తాళాలతో ఊరేగించారు. కాగా శుక్రవారం స్వామివారి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఏకాదశ రుద్రాభిషేకం, సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నారు.

నేడు పేరంటాలమ్మ ఆలయంలో చండీ హోమం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం అమావాస్యను పురస్కరించుకుని చండీ హోమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 8.30 గంటలకు హోమం ప్రారంభమవుతుందన్నారు. భక్తులు పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

కంకిపాడు: మెరుగైన విద్యుత్ సరఫరాకు పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీఈ బి.నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని మారేడుమాక గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. అనంతరం కంకిపాడు సబ్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలన్నారు. ఇప్పటికే విద్యుత్ స్తంభాలను సరిచేయడం, లూజు లైన్లకు మరమ్మతులు చేయడం జరుగుతోందన్నారు. పూర్తి స్థాయిలో లైన్లను సవరించి విద్యుత్ సరఫరా సమర్థంగా సాగేలా చూస్తామని పేర్కొన్నారు. ఏఈ టీ అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పి.నైనవరంలో గ్రామ సభ

పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామంలో గురువారం గ్రామ సభ జరిగింది. సభలో గ్రామ సర్పంచ్ బొట్టా సోమయ్య మాట్లాడుతూ తీర్మానం ప్రకారం ఉపాధి హామీ పనులు జరగడంలేదన్నారు. పనుల నిర్వహణ పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంటు నిర్వహణ లోపం ఉందన్నారు. మస్టర్లు తక్కువగా ఉన్నాయని, చెల్లింపులు అధికంగా జరిగాయని డీఆర్‌పీ నివేదికను సమర్పించారు. ఉపాధి పథకంలో మొక్కలు 640 నాటారని ప్రస్తుతం అవి 340 మంది మాత్రమే ఉన్నాయన్నారు. గ్రామంలో 459 మంది పెన్షన్లు తీసుకొంటున్నారని, గత ఆరు నెలలుగా రూ. 81.20 లక్షలు లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని డీఆర్‌పీ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎస్.చెన్నకేశవరావు, ఏపీఓ శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంటు కిరణ్మయి, ఉపాధి కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు

పెనమలూరు: వ్యక్తిపై దాడి చేసిన ఇరువురిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు లంబాడీపేటకు చెందిన భుక్యా వంశీ, అతని బాబాయి భుక్యా రవికిరణ్ ఈవెంట్ కాంట్రాక్టు పనులు చేస్తారు. కాగా రెండు రోజుల క్రితం వంశీ, రవికిరణ్ ఈవెంట్ పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా పాత కక్షల కారణంగా శ్రీహరి, ధనుంజయ్ వారిని అడ్డగించి దాడి చేశారు. ఈ దాడిలో వంశీకి గాయాలు అయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో కొండ వెనుక ప్రాంతంలో ఆక్రమణల జోరు పెరిగింది. అత్యంత విలువైన ప్రభుత్వ భూములపై అధికార పార్టీ నేతల కళ్లు పడ్డాయి. గత కొద్ది రోజుల క్రితం రాజకీయ ప్రత్యర్థుల షాపులు ఆక్రమణల్లో ఉన్నాయని అధికారులు వాటిని తొలగించారు. అయితే టీడీపీకి చెందిన వారి ఆక్రమణలు తొలగించలేదు. పైగా ఇప్పుడు టీడీపీ నేతలు రేకులు వేసి పూర్తి స్థాయిలో ఆక్రమణలకు దిగారు. తాడిగడప మున్సిపాలిటీ అధికారులు కాని, రెవెన్యూ అధికారులు కాని నిమ్మకు నీరెత్తినట్లు చోద్యం చూస్తుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చిరస్మరణీయుడు అల్లూరి సీతారామరాజు

ఘనంగా మన్యం వీరుడి జయంతి

కంకిపాడు: విప్లవ యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి తహసీల్దార్, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ వారిపై పోరాడిన గొప్ప యోధుడు అల్లూరి అని కొనియాడారు. అల్లూరి పోరాట పటిమ నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఆర్‌ఐలు రాఘవరావు, వెంకటరమణ, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి చిత్రపటానికి ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు పోరాట పటిమను ఆయన గుర్తుచేసుకున్నారు. కార్యాలయ సూపరిండెంట్ జేవీఎస్ఆర్కే ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కే సతీష్, పలువురు మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కానూరులో..

పెనమలూరు: కానూరు గ్రామంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. అశోక్ జిమ్ ఆధ్వర్యంలో మాతృ హృదయ్ స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో అల్లూరి జయంతి వేడుకలు చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు తాళ్లూరి అశోక్ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అల్లూరి సీతారామరాజు ప్రాణ త్యాగం చేశారన్నారు. నేటి యువత అల్లూరిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేత యార్లగడ్డ శ్రీను, బాడీ బిల్డింగ్ క్రీడాకారులు, సభ్యులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం భావితరాలకు ఆదర్శమని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. గురువారం అల్లూరి జయంతిని పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పాఠకులు, గ్రామపెద్దలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన్యం ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన వీరుడు అల్లూరి అని పేర్కొన్నారు. తన ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడు అల్లూరి అని కొనియాడారు.

ఉయ్యూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఆర్డీఓ డి.రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఓ అనసూయ, సీనియర్ అసిస్టెంట్ భవానీశంకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. ఉయ్యూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు అల్లూరికి నివాళులర్పించారు.

పింగళి వర్ధంతి, అల్లూరి జయంతి

విజయవాడరూరల్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య వర్ధంతి, మన్యం వీరుడు, బ్రిటీష్ వారిపై అలుపెరగని పోరాటం చేసిన అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా గురువారం విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో వారి చిత్ర పటాలకు ఘనంగా నివాళులర్పించారు. పింగళి వెంకయ్య, అల్లూరి సీతారామరాజుల త్యాగం నేటి యువతకు ఆదర్శనీయమని ఇన్‌ఛార్జి ఎంపీడీఓ, ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అసిస్టెంటు ఇంజినీర్ ఎస్.శివరామకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ కార్యాలయం, అప్పనవీడు జెడ్పీ హైస్కూల్‌లో అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం వేర్వేరుగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అల్లూరి చిత్రపటానికి పలువురు మానవత సభ్యులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



ఉయ్యూరులో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ రాజు, సిబ్బంది



కానూరులో అల్లూరికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పురుషోత్తపట్నంలో అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కృపానందం, గ్రామస్తులు



అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ తదితరులు



గన్నవరంలో అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది



రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో పింగళి వెంకయ్య, అల్లూరి చిత్రపటాల వద్ద నివాళులు

ఇంటి పన్ను సకాలంలో వసూలు చేయాలి



పెనమలూరు: సకాలంలో ఇంటి పన్ను చెల్లించేలా సచివాలయ సిబ్బంది, మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. కానూరు, యనమలకుదురు ప్రాంతాల్లో గురువారం ఆయన సచివాలయ సిబ్బంది, మున్సిపాలిటీ ఉద్యోగులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో నూతన పన్నులు వేయడం, పన్నుల బకాయి వసూళ్లు చేయడంపై సిబ్బంది దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి బాబురావు, ముప్పవరపు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయానికి రూ. 45 వేలు వితరణ



ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలోని తోట్లవల్లూరు రోడ్డులో అయ్యప్పస్వామి ఆలయంలో నూతన విగ్రహాల ఏర్పాటుకు గురువారం బీవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బొమ్మారెడ్డి వెంకటరెడ్డి రూ. 45 వేలు అందించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి ఎప్పుడూ ఉంటుందన్నారు. ఆధ్యాత్మిక జీవనాన్ని అలవర్చుకుని సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో రాజులపాటి ఫణి, ఆరేపల్లి రమేష్, శ్యాం, నెరుసు బాలకృష్ణ పాల్గొన్నారు.

వంగవీటి మోహన రంగా సేవలు మరువలేనివి



ఉయ్యూరులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్



నున్నలో వంగవీటి రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రామవరప్పాడులో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

నున్న(విజయవాడరూరల్): పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన వంగవీటి మోహనరంగా సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. నున్న గ్రామంలో గురువారం వంగవీటి మోహనరంగా జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ పేదల హృదయాల్లో సుస్థిరస్థానం ఏర్పరుచుకున్న వీఎం రంగా అందరివాడని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, ఉపసర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, అంగజాల హనుమా, బొంతు సాంబిరెడ్డి, చింతా రేణుక, దండు సుబ్రహ్మణ్యం రాజు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు అంకిత అపార్టుమెంట్ వద్ద గురువారం వంగవీటి మోహన రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హాజరై రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొల్లా ఆనంద్‌కుమార్, నాయకులు నభిగాని కొండయ్య, అద్దెపల్లి సాంబశివనాగరాజు, కొంగన రవికుమార్, కొళ్లిపల్లి సాయి రామరాజు, మత్తె రాధా తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి వంగవీటి మోహన రంగా అని పలువురు వక్తలు కొనియాడారు. వీఎం రంగా జయంతి వేడుకలు ఉయ్యూరు పట్టణం, పలు గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన సెంటరులో జరిగిన వేడుకల్లో రంగా చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, మాజీ ఫ్లోర్ లీడర్ వంగవీటి శ్రీనివాస ప్రసాద్, రత్నం బుజ్జి తదితరులు పాల్గొన్నారు. కాటూరులో జరిగిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ రంగా విగ్రహానికి నివాళులర్పించారు.

చెత్త కుప్పలతో ఇబ్బందులు



ఎనికేపాడులో అంతర్గత రహదారి పక్కనే చెత్త



రామయ్య చెరువు సమీపంలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో పారిశుద్ధ్యం అధ్వానంగా మారడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాల్వగట్టు ప్రాంతం, శివాలయ పల్లాలు, ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త దర్శనం ఇస్తోంది. హిందూ శ్మశానం సమీపంలోని రామయ్య చెరువు వద్ద పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఇక్కడ చెత్త కుప్పలు పేరుకుపోవడంతో నిత్యం తీవ్ర దుర్వాసనతో పాటు పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ చెత్త డంపింగ్ నిలిపివేయాలని, పేరుకుపోయిన చెత్త కుప్పలను తొలగించాలని ఎన్నో సార్లు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గ్రామంలోని మురుగంతా చెరువు సమీపంలోని కాలువలో తిప్ప వేస్తోందని ఫలితంగా మురుగునీరు ప్రవాహం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు చెబుతున్నారు. కాల్వగట్టు ప్రాంతంలో సరైన డ్రెయిన్లు లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే నివాసాల మధ్యకు మురుగు చేరుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త కుప్పలు తొలగించి, పారిశుద్ధ్య నిర్వహణను మెరుగు పరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

\- రామవరప్పాడు

ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఇంటూరి ఏలియా

కంకిపాడు: ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియా డిమాండ్ చేశారు. కంకిపాడులోని సమితి కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ప్రతి కుటుంబానికి రెండెకరాల భూమి, ప్రైవేటు సంస్థల్లోనూ ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి కల్పించేలా రిజర్వేషన్ల అమలు వంటి వాటిపై చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీల భూములు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుని ఎస్సీ, ఎస్టీలకు రక్షణగా నిలవాలని కోరారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. క్షేత్ర స్థాయిలో సంఘాన్ని బలోపేతం చేస్తూ పూర్తి స్థాయిలో గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తామని, సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామని వివరించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తామని స్పష్టంచేశారు.

ఈడుపుగల్లులో హెచ్‌ఎంలతో ఎంఈఓ సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రసాద్

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులతో గురువారం ఎంఈఓ ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రవేశ కార్యక్రమాలను సమర్థంగా పూర్తి చేయాలన్నారు. పాఠశాల ప్రాంగణాల్లో భద్రతా చర్యలు, పచ్చదనం, ఆరో తరగతి విద్యార్థులను దత్తత తీసుకుని విద్యాబోధన చేసే విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనం సమర్థంగా అందించేందుకు వంట గది షెడ్లు, పరిసరాల పరిశుభ్రత, కిచెన్ గార్డెన్‌ల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. పాఠ్యపుస్తకాలు, కిట్లు ప్రతి విద్యార్థికీ చేరేలా చూడాలన్నారు. సమావేశంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్ పరిధిలో సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డీఈ ఆపరేషన్స్ పి.హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతాపురంకాలనీ, శ్రీనివాస నగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, బందర్ రోడ్డులో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భర్త ఇంటి ఎదుట నిరసన

నున్న(విజయవాడరూరల్): భర్త వద్దంటున్నాడు అంటూ తన ఇంటి ఎదుట భార్య రోడ్డు మీద నిరసన వ్యక్తం చేసింది. వివరాల్లోకి వెళితే నున్న గ్రామానికి చెందిన యనగంటి బద్రి అనే వ్యక్తి పెనుగంచిప్రోలుకు చెందిన ఉమాను ఆరేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు. ప్రస్తుతం ఆమె గర్భిణీ. భార్యను తరుచు శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తూ నాకు నువ్వు వద్దంటూ ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. భర్తకు అండగా అత్త మామలు ఏకమై ఆమె పట్ల కర్కశకంగా ప్రవర్తిస్తున్నారు. పుట్టింటి వాళ్లు రెండు దఫాలు వచ్చి మాట్లాడిన ప్రయోజనం లేకపోయింది. చేసేది లేక ఆమె తన ఇంటి ఎదుట రోడ్డుపై నిరసన చేస్తోంది.

265 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో 2023-2024 సంవత్సరంలో వివిధ బహుళజాతి సంస్థల్లో తమ విద్యార్థులు 265 మంది ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విద్యార్థులకు సాంకేతిక కోర్సులకు అనుగుణంగా స్కిల్స్, సమగ్ర కెరీర్ గైడెన్స్, ట్రైనింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందిచడంతో ఇంటర్వ్యూలలో సత్తాచాటి ఉద్యోగాలు సాధించారని వివరించారు. కాలేజీ డైరెక్టర్ డీకేఆర్కే రవిప్రసాద్ మాట్లాడుతూ తమ కాలేజీకి 30 బహుళజాతి సంస్థలు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించాయన్నారు. 265 మందికి ఉద్యోగాలు రాగా మరో 130 మంది ఉద్యోగాల ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తుకు మార్గం కల్పించడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీన్స్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం పోరాడిన సూర్యవతి

పెనమలూరు: మహిళల హక్కుల కోసం కమ్యూనిస్టు నాయకురాలు మానికొండ సూర్యవతి పోరాటం చేశారని మండల ఐద్వా కార్యదర్శి పాతళ లక్ష్మి అన్నారు. యనమలకుదురు, తాడిగడప గ్రామాల్లో కామ్రేడ్ మానికొండ సూర్యవతి వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ సూర్యవతి బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేశారన్నారు. వలిమా, కోటేశ్వరమ్మ, రమణమ్మ, రంగనాయకమ్మ, షేక్ ఫాతిమా, లావణ్య పాల్గొన్నారు.

రైతుబజార్ ఏర్పాటు చేయండి

మండల పరిధిలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కానూరు పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న నీటిపారుదల శాఖ స్థలంలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని కోరారు. నేతలు వెంకట్రావు, వై.సరళ, అశోక్ కుమార్, పద్మావతి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మహిళపై అగంతకుడు దాడి

నున్న(విజయవాడరూరల్): మహిళపై అగంతకుడు దాడి చేసి బంగారు నానతాడును ఎత్తికెళ్లిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గురువారం ఉదయం పాతపాడు గ్రామ శివారు మంగళాపురం గ్రామానికి చెందిన పామర్తి లక్ష్మి(52) అనే మహిళ ఉపాధి పని కోసం పోలవరం కాల్వ కట్టపై వస్తుండగా ఒక అగంతకుడు చెట్ల మధ్య నుంచి వచ్చి ఆకస్మికంగా ఆమె మెడలో బంగారు నానతాడు తెంపాడు. ఆమె అడ్డుకునే ప్రయత్నం చేయగా అతడు బ్లేడ్‌తో బాధితురాలి చేతిని గాయపర్చి బంగారు నానతాడుతో పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో నున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పత్రాలు దహనం చేశారని ఇద్దరిపై కేసు

పెనమలూరు: కాలుష్య నివారణ మండలికి చెందిన పత్రాలు దహనం చేశారని వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుతో ఇద్దరు వ్యక్తులపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి కాలుష్య నివారణ మండలిలో పనిచేసే అటెండర్ రూపేంద్ర, కారు డ్రైవర్ నాగరాజు యనమలకుదురు-పెదపులిపాక గ్రామాల సరిహద్దులో కరకట్టపై కారులో తీసుకువచ్చిన పలు పత్రాలు దగ్ధం చేశారు. స్థానికుల సమాచారంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అయితే దగ్ధం చేసిన పత్రాలు కాలం చెల్లినవా లేక ముఖ్యమైన పత్రాలా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.